సాక్షి నంద్యాల

శనివారం । 21 । జనవరి । 2023



భ్రామరీకి ఊయల సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం దేవస్థానం అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. అలాగే శ్రీశైల గ్రామ దేవత అంకాళమ్మకు పూజలు చేపట్టారు.



ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దు

నిర్లక్ష్యం చేయకుండా తరచుగా వైద్యపరీక్షలు చేయించుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని న్యాయవాదులకు లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణ్ రెడ్డి సూచించారు.

8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,619.59
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 60.187
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 9,288

న్యూస్‌రీల్

బీజీ రైల్వేస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా వెంకట శివ

నంద్యాల: నంద్యాల బ్రాడ్ గేజ్ రైల్వేస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా వెంకట శివ చంద్రగిరిని నియమిస్తూ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో బ్రాడ్‌గేజ్ రైల్వేస్ డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయనను పదోన్నతిపై నంద్యాలకు నియమించారు.

తక్కువ కూలీలతో ప్రకృతి వ్యవసాయం



మాట్లాడుతున్న సీనియర్ శాస్త్రవేత్త ధనలక్ష్మి

బనగానపల్లె రూరల్: తక్కువ కూలీలతో ప్రకృతి వ్యవసాయం చేయవచ్చునని కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన సీనియర్ శాస్త్రవేత్త ధనలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం యాగంటిపల్లె కేవీకేలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేల సారవంతాన్ని పెంపొందించేందుకు ప్రకృతి వ్యవసాయం అవసరమన్నారు. ఈ పంటలకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త బాలరాజు, ఆదినారాయణ, రవిగౌడ్ రైతులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించండి

- ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ ఉమాపతి

నంద్యాల(రూరల్): జిల్లాలో విద్యుత్ వినియోగదారులు, రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని ఉమ్మడి జిల్లా ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ ఉమాపతి అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం పట్టణంలోని విద్యుత్ కమర్షియల్ ఎస్టేట్, ఈఈ కార్యాలయం, విద్యుత్ బిల్లుల సేకరణ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రైతులకు పగటి పూట 9 గంటల విద్యుత్ సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా పెండింగ్ విద్యుత్ బిల్లులపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి వసూలు చేయాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే విద్యుత్ ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలన్నారు. ఎస్ఈ వెంట ఈఈ రమణారెడ్డి, ఏడీఏలు ఆంథోనిరాజ్, సతీష్‌కుమార్‌రెడ్డి, ఏఈలు నాగరాజు, రామయ్య, రవికుమార్ తదితరులు ఉన్నారు.

ప్రొటోకాల్ పాటించని అధికారులు

- ముగ్గురికి మెమోలు జారీ

నంద్యాల: గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ పర్యటన నిమిత్తం నంద్యాల జిల్లాకు వచ్చిన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి రాజన్నదొరకు చుక్కెదురైంది. గవర్నర్ పర్యటనలో పాల్గొనడానికి విజయవాడ నుంచి రైలులో గురువారం అర్ధరాత్రి రాత్రి 12 గంటలకు నంద్యాలకు వచ్చిన డిప్యూటీ సీఎంకు ఆహ్వానించే వారే కరువయ్యారు. ఒక్క అధికారి కూడా రైల్వే స్టేషన్‌లో లేకపోవడంతో డిప్యూటీ సీఎం జిల్లా కలెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో డిప్యూటీ సీఎంకు ప్రొటోకాల్ పాటించి ఆహ్వానం పలకని ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి, నంద్యాల, కర్నూలు డీటీడబ్ల్యూఓలు హుసేనయ్య, శ్రీనివాసులుకు మెమోలు జారీ చేసినట్లు డీఆర్ఓ పుల్లయ్య శుక్రవారం రాత్రి తెలిపారు.

వాటర్ ప్లాంట్లలో విజిలెన్స్ తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

కర్నూలు(టౌన్)/నంద్యాల: మినరల్ వాటర్ ప్లాంట్లలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నాలుగు బృందాలుగా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో నిబంధనలు పాటించని శివగంగ మినరల్ వాటర్ ప్లాంట్ (పందిపాడు), హిమాలయ బాట్లింగ్ కంపెనీ (కల్లూరు ఎస్టేట్), శ్రీసాయి లక్ష్మీ వెంకటేశ్వర ఇండస్ట్రీస్ (దిన్నెదేవరపాడు), సేఫ్టీ కింగ్ వాటర్ ప్యాకింగ్ యూనిట్ (నందికొట్కూరు), నంద్యాల రూరల్ పరిధిలోని పెద్దకొట్టాలలో ఉన్న డెసర్ట్ మినరల్ వాటర్ ప్లాంటుపై విజిలెన్స్ అధికారులు కేసులు నమోదు చేశారు. వీటిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి నివేదించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాంతీయ అధికారి తిరుమలేశ్వర రెడ్డి, సీఐ శ్రీధర్, ఏఏఓ షణ్ముఖ గణేష్, డీఈ గుణకర్ రెడ్డి, ఏఈ చంద్రశేఖర్, ఎఫ్ఆర్వో ఖాన్ పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శన ఇస్తున్న విద్యార్థిని

విద్య, వైద్యంతోనే జీవితాలు మెరుగు

“ గిరిజనుల విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. అటవీ, వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేసి మార్కెటింగ్‌తో ఆర్థికంగా అండగా నిలుస్తోంది. విద్య ఉంటే భవిష్యత్ బాగుంటుంది. ఆరోగ్యం ఉంటే జీవనం బాగుంటుంది. ఈ రెండిటినీ గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తోంది.

– బిశ్వభూషణ్ హరిచందన్, రాష్ట్ర గవర్నర్





అభివాదం చేస్తున్న గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, వేదికపై మంత్రులు అంజాద్‌బాషా, రాజన్నదొర, ఎంపీ, ఎమ్మెల్యేలు, అధికారులు

గిరిజనుల అభివృద్ధే లక్ష్యం

- గూడేల్లో అన్ని రకాల సదుపాయాలు
- ప్రతి అడవి బిడ్డకు ఉచితంగా విద్య, వైద్యం అందిస్తున్నాం
- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా
- పొదుపు సంఘాలకు రూ.4కోట్ల చెక్కును అందించిన గవర్నర్ విశ్వభూషణ్
- గిరిజనుల జీవనంపై అద్దం పట్టేలా స్టాళ్ల ఏర్పాటు
- డీఆర్‌డీఏ ద్వారా లబ్ధిదారులకు పొట్టేళ్లు, కుట్టుమిషన్లు, ఆయిల్ ఇంజిన్లు, పెరటికోళ్ల పంపిణీ

పాణ్యం: అడవి బిడ్డల సుస్థిరాభివృద్ధే ప్రభుత్వం ధ్యేయమని, ఆ మేరకు గిరిజనులకు ప్రత్యేక అవకాశాలు కల్పిస్తున్నట్లు నంద్యాల జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఉపముఖ్యమంత్రి అంజద్‌బాషా అన్నారు. శుక్రవారం పాణ్యం మండలం నెరవాడమెట్ట వద్ద ఉన్న గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో 'గిరిజనులతో గవర్నర్ ముఖాముఖి' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, ఉపముఖ్యమంత్రి అంజద్‌బాషా, గిరిజన శాఖ మంత్రి పీడిక రాజన్నదొర, శాసనమండలి విప్ గంగుల ప్రభాకర్‌రెడ్డి, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, గిరిజన శాఖ సెక్రటరీ కాంతిలాల్ దండే, డైరెక్టర్ జాహ్నవి, నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, రవిచంద్రకిషోర్‌రెడ్డి, గంగుల బిజేంద్రారెడ్డి, తొగురు ఆర్థర్ తదితరులు హాజరయ్యారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా మాట్లాడుతూ.. నల్లమల అడవి 3,600 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉందని, ఇందులో 52,784 మంది చెంచులు, ఇతర గిరిజనులు నివసిస్తున్నారన్నారు. గిరిజన గూడేల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2019 జూన్ నుంచి 2022 డిసెంబర్ వరకు 36,02,315 మందికి రూ.9,364కోట్లు డీబీటీ ద్వారా 18,11,175 మందికి రూ. 6,478కోట్లు నాన్‌డీబీటీ ద్వారా ఖర్చు చేసినట్లు చెప్పారు. ఆశ్రమ, గురుకుల, ఏకలవ్య పాఠశాలలు ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రధానమంత్రి వన్‌దన్ వికాస్ ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలు తేనె సేకరణతోపాటు నన్నారి, మాడపాకుల ప్లేట్లు, కప్పులు తయారీ చేస్తూ జీవనోపాధి పొందుతున్నారన్నారు. గిరిజన ఆవాస కేంద్రాల్లో 24 గంటలు పనిచేసే ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గిరిజనుల కోసం దోర్నాలలో రూ.49.26కోట్లతో సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మిస్తున్నట్లు తెలిపారు. గూడేలకు బైక్ అంబులెన్స్‌లు కూడా ఏర్పాటు చేసినట్లు వివరించారు.

రూ.4 కోట్ల చేయూత

పాణ్యం నియోజకవర్గంలోని గిరిజన పొదుపు గ్రూపులకు రూ. 4కోట్ల మేర రాష్ట్ర ప్రభుత్వం లబ్ధి చేకూర్చినట్లు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తెలిపారు. ఆశ్రమ, ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాలల్లో కేవలం యానాది, చెంచు, మరో రెండు కులాలకు చెందిన విద్యార్థులే ప్రవేశాలు పొందుతున్నారని, వీరితో పాటు ఎరుకలి, సుగాలి, ఎస్టీ జాబితా కింద వచ్చే ప్రతి కులానికి చెందిన విద్యార్థులకు సీట్లు కేటాయించాలని కోరారు. గిరిజన గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న నామినేటెడ్ పోస్టులను గిరిజనులకే చెందేలా చూడాలని మంత్రిని కోరారు. ఎస్టీలకు ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు పంపిణీ చేయాలన్నారు.

అలరించిన నృత్యాలు

పొదుపు సంఘాల మహిళలకు రూ.4 కోట్ల చెక్కును రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ అందజేశారు. కార్యక్రమంలో గిరిజన సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆహూతులను అలరించాయి. గిరిజనుల జీవన విధానాన్ని తెలిపేలా ఏర్పాటు చేసిన స్టాళ్లు ఆకట్టుకున్నాయి. లబ్ధిదారులకు పొట్టేళ్లు, కుట్టుమిషన్లు, ఆయిల్ ఇంజిన్లు, పెరటికోళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేసీ నిషాంతి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి, నంద్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నీసా, ఎస్టీ కమిషన్ సభ్యులు శంకర్‌నాయక్, జెడ్పీటీసీ సభ్యురాలు సద్దల సరళమ్మ, ఎంపీపీ ఉసేన్‌బీ, జెడ్పీటీసీ మాజీ సభ్యులు సూర్యనారాయణరెడ్డి, వీటీడీఏ సభ్యుడు సుబ్బరాయుడు పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన గిరిజనులు, విద్యార్థులు

గవర్నర్‌కు ఘన స్వాగతం

ఓర్వకల్లు: ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విమానాశ్రయంలో రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్‌కు పలువురు ప్రముఖులు స్వాగతం పలికారు. గవర్నర్ బెంగళూరు నుంచి విమానంలో శుక్రవారం ఉదయం 11.15 గంటలకు ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. ఆయనకు కర్నూలు జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు, డీఐజీ సెంథిల్ కుమార్, ఎస్పీ సిద్ధార్థ కౌశల్, నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి తదితరులు స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ రోడ్డు మార్గాన ప్రత్యేక కాన్వాయ్‌లో పాణ్యం మండలంలోని నెరవాడ మెట్టకు బయలుదేరారు. కార్యక్రమం ముగిసిన తర్వాత సాయంత్రం 3.30 గంటలకు తిరిగి ఓర్వకల్లు ఎయిర్ పోర్టుకు చేరుకుని విమానంలో బెంగళూరుకు వెళ్లారు.



ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలివ్వాలి

టీడీపీ హయాంలో 2014–19లో 41,58,626 మంది గిరిజనులకు రూ. 5,779.21కోట్లు మాత్రమే లబ్ధి జరిగితే, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో 2019 నుంచి ఇప్పటి వరకు 73,24,078 మంది గిరిజనులకు రూ.16,312.48 కోట్ల లబ్ధి చేకూరింది. అదనంగా 31,65,452 మంది లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయి. గతానికి, ఇప్పటికీ గిరిజనుల సంక్షేమం, అభివృద్ధిలో తేడాను గిరిజన నేతలు, ప్రజాప్రతినిధులు గమనించాలి. ఆర్ఓఎఫ్ఆర్(రికగ్నిజేషన్ ఆఫ్ ఫారెస్ట్ రైట్స్) కింద దరఖాస్తులు వస్తున్నాయి. కలెక్టర్, డీఎఫ్ఓ, పీఓ ఎందుకు పెండింగ్ పెడుతున్నారో అర్థం కావడం లేదు. దీనిపై ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ఆరా తీశారు. గిరిజనులకు పట్టాలివ్వడంపై ప్రత్యేక దృష్టి సారించాలి. గిరిజన పాఠశాలల్లో చెంచులతోపాటు ఎస్టీల్లోని మిగతా కులాలకూ సీట్లు వచ్చేలా చేస్తాం.

– రాజన్న దొర, గిరిజన శాఖ మంత్రి



గిరిజన సంప్రదాయ నృత్యాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థినులు



కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన చెంచుల వేట చిత్రం



గిరిజన జీవన శైలిని ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన స్టాల్

కానిస్టేబుల్ పరీక్షకు పటిష్ట బందోబస్తు

బొమ్మలసత్రం: ఆంధ్రప్రదేశ్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో ఆదివారం జరిగే కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్ష కోసం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి పేర్కొన్నారు. నంద్యాల, పాణ్యంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 22న నిర్వహించే కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షకు జిల్లా కేంద్రం నంద్యాలలో 22, మండల కేంద్రం పాణ్యంలో ఐదు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు పరీక్ష జరుగుతుందని, అభ్యర్థులను ఉదయం 9 గంటల నుంచే కేంద్రంలోకి అనుమతిస్తున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా 387 మంది సిబ్బందితో గట్టి బందోబస్తు చేపడుతున్నామన్నారు. ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులు తమ వెంట హాల్ టికెట్‌తో పాటు గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు లోనికి అనుమించేది లేదన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ మహేశ్వరరెడ్డి, ఎస్‌బీ సీఐ దస్తగిరిబాబు, రీజనల్ కోఆర్డినేటర్ అశోక్, పాణ్యం సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ సుధాకర్ తదితరులు ఉన్నారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

ప్రత్యేక బస్సు సర్వీసులు

నంద్యాల(వ్యవసాయం): ఈనెల 22వ తేదీ ఆదివారం జరిగే పోలీసు కానిస్టేబుల్ రాత పరీక్ష దృష్ట్యా ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. నంద్యాల జిల్లాలో 33 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరుగుతుందని, అభ్యర్థుల సౌకర్యార్థం ఆయా కేంద్రాలకు బస్సు సర్వీసులు నడుపుతున్నామన్నారు.

సందడిగా నారసింహుడి పార్వేట

ఆళ్లగడ్డ: ఊరూరా పార్వేట ఉత్సవాలు సందడిగా కొనసాగుతున్నాయి. జ్వాలా నారసింహుడు, ప్రహ్లాద వరదస్వాములు శుక్రవారం ఉత్సవ పల్లకీలో కోటకందుకూరు చేరుకున్నారు. భక్తులు గ్రామ పొలిమేర వద్దకు మేళతాళాలతో వచ్చి భక్తులు ఘన స్వాతగం పలికారు. తెలుపులపై కొలువైన స్వామిని దర్శించుకున్నారు. పార్వేట కొనసాగే పల్లెల్లో పండుగ వాతావరణం కనిపిస్తోంది.



పల్లకీలో ఊరేగుతున్న ఉత్సవ మూర్తులు

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- డిప్యూటీ సీఎం రాజన్న దొర
- మునగాలలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

నంద్యాల(రూరల్): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి రాజన్న దొర అన్నారు. శుక్రవారం గవర్నర్ పర్యటనకు వచ్చిన ఆయన మండలంలోని మునగాల గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఆయనకు గ్రామ సర్పంచ్ లోకేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం లభించింది. అనంతరం గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. అర్హులందరికీ పథకాలు వర్తింపజేయాలని, ఏదైనా సాంకేతిక కారణాలతో జాప్యమైనా వెంటనే అందేలా చర్యలు చేపట్టాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులకు అండగా నిలుస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనన్నారు. గత ప్రభుత్వంలో నాయకులు రైతులను ఓటర్లుగా మాత్రమే చూశారని, నేడు వారి అభివృద్ధికి సీఎం జగనన్న అడుగడుగునా చేయిపట్టి నడిపిస్తున్నారని వివరించారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఇప్పటికే 95 శాతం అమలు చేసి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. టీడీపీ నాయకుల మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని చెప్పారు. పథకాలు, అభివృద్ధి కొనసాగాలంటే జగనన్నపై ప్రజల దీవెనలుండాలని కోరారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి ఇంటికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా.. లేదా అని అడగటం ఇదే తొలిసారన్నారు. ఎంపీ పోచా బ్రహ్మానందారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దకే వలంటీర్ ద్వారా సంక్షేమ పథకాలు అందించడం పట్ల ప్రజల గుండెల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిరస్థాయిగా నిలిచారన్నారు. ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న బాటలోని తాము నడుస్తూ నంద్యాల నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి ప్రభాకర్, మండల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



మహిళతో ముచ్చటిస్తున్న డిప్యూటీ సీఎం రాజన్న దొర, చిత్రంలో ఎమ్మెల్యే శిల్పా రవి, ఎంపీ పోచా

26న వసంత పంచమి వేడుకలు

- ముస్తాబవుతున్న కొలనుభారతీ క్షేత్రం



కొలనుభారతీ దేవి క్షేత్ర పరిసరాలలో మట్టి చదును చేస్తున్న కూలీలు

కొత్తపల్లి: రాష్ట్రంలో ఏకైక చదువుతల్లి క్షేత్రంగా విరాజిల్లుతున్న కొలనుభారతీదేవి ఆలయం వసంత పంచమి వేడుకలకు ముస్తాబవుతోంది. ఈనెల 26న వసంతపంచమి వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు దేవదాయ శాఖ అధ్వర్యంలో ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. ఆలయానికి రంగులు వేయడం, పరిసరాలను చదును తదితర పనులు చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా భక్తులు వారి చిన్నారులకు ఇక్కడ అక్షరాభ్యాసం చేయించేందుకు వస్తుండటంతో ఆ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

నీళ్లొస్తున్నాయోచ్..!

దాదాపు మూడు దశాబ్దాల నాటి సమస్య ఎట్టకేలకు పరిష్కారం కాబోతుంది. మండల కేంద్రం దొర్నిపాడులోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో సుమారు 30 ఏళ్ల క్రితం ఏర్పాటైన బీసీ కాలనీలో మంచి నీటి వసతి లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ స్థానికులు సమస్య ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారు ఎంపీడీఓ నాగఅనసూయతో మాట్లాడి దాదాపు రూ.7 లక్షల నిధులు మంజూరు చేయించారు. 750 మీటర్ల మేర పైపులైన్ పనులు పూర్తి కావచ్చాయి. మరో రెండు రోజుల్లో తమ చెంతకు నీళ్లు వస్తుండటంతో కాలనీ ప్రజలతో పాటు గ్రామ సర్పంచ్ దేవమణి, ఉప సర్పంచ్ లక్ష్మీరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కాకనూరు మనోహర్ రెడ్డి హర్షం వ్యక్తం చేస్తున్నారు. – దొర్నిపాడు



బీసీ కాలనీలో పైప్ లైన్ వేసిన దృశ్యం

భారీగా రేషన్ బియ్యం స్వాధీనం



విజిలెన్స్ అధికారులు సీజ్ చేసిన లారీ

బనగానపల్లె:పట్టణ శివారులోని రైస్ మిల్లులో శుక్రవారం ఉదయం 324 క్వింటాళ్ల రేషన్ బియ్యం, 149 క్వింటాళ్ల నూకలను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా విజిలెన్స్ సీఐ కేశవరెడ్డి మాట్లాడుతూ రైస్ మిల్లు నుంచి లారీలో రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి పట్టుకున్నామన్నారు. రైస్ మిల్లు యజమాని శ్రీనివాసులుతో పాటు డ్రైవర్ వెంకట రాముడుపై కేసు నమోదు చేసి, స్థానిక పోలీసు స్టేషన్‌కు అప్పగించామన్నారు. బియ్యంను నంద్యాల సివిల్ సప్లయిస్టాక్ పాయింట్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దు

- తరచూ వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలి
- లోకాయుక్త జస్టిస్ పి. లక్ష్మణ్ రెడ్డి



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి

కర్నూలు(లీగల్): న్యాయవాదులు పని ఒత్తిడిలో తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తుంటారని, అలా కాకుండా తరచుగా వైద్యపరీక్షలు చేయించుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి సూచించారు. ఆయుష్ విభాగం, విశ్వ ఆయుర్వేద పరిషత్ సంస్థల సహకారంతో జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌లో ఏర్పాటు చేసిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అత్యంత పురాతనమైన, ఎటువంటి ప్రతికూల ప్రభావం లేని ఆయుర్వేదంలో అద్భుతమైన వైద్యం అందుబాటులో ఉందన్నారు. న్యాయవాదులు, కోర్టు సిబ్బంది కోసం తరచుగా కమిషన్ ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వైద్యశిబిరంలో దాదాపు 150 మంది న్యాయవాదులు, ఇతరులు వైద్యసేవలు పొందారు. శిబిరంలో జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో సీబీఐ, ఏసీబీ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తులు ఎం.వెంకటరమణ, సునీత, న్యాయమూర్తులు టి.కేశవ, డి.షర్మిల, కె.భార్గవి, కమిషన్ అధ్యక్షులు కె.కిషోర్‌కుమార్, సభ్యులు ఎన్.నారాయణరెడ్డి, నజీమా కౌసర్, బార్ కౌన్సిల్ సభ్యులు రవిగువేరా, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ మనోహర్, సీనియర్ న్యాయవాదులు శివసుదర్శన్, ప్రకాశ్‌రెడ్డి, ఎంఎల్ శ్రీనివాసరెడ్డి, కమిషన్ సిబ్బంది రాముడు, రవీంద్రనాథ్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, పద్మజ, సుజాత, రోషన్న తదితరులు పాల్గొన్నారు. వైద్యులు పద్మనాభరెడ్డి, మాధవరావు చౌదరి, లావణ్య, సాయి శ్రీలు పాల్గొని వైద్యసేవలు అందించారు.

క్రికెట్ ఆడుదాం.. ప్రతిభ చాటుదాం

ఈ నెల 22 సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ఎంట్రీలకు చివరి తేదీ

SAKSHI SAKSHI DIGITAL MEDIA GROUP

SPL SAKSHI PREMIER LEAGUE

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

District sponsor

GPCET Pioneering Innovative Education

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపాదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్-19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్-25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.

జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్‌ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజినీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్ఠంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: 9705347392, 9666697219

గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

మహిళా దొంగపై కేసు నమోదు

కర్నూలు(టౌన్): కర్నూలు రెండవ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొత్తపేటలో తెలిసిన ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న అదే కాలనీకి చెందిన స్వప్న అనే మహిళా దొంగపై పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానికంగా కొత్తపేటలో టైలరింగ్ శిక్షణ ఇస్తున్న రాణి ప్రియాంక అనే మహిళ ఇంటిలో టైలరింగ్ శిక్షణ నేర్చుకుంటుంది. ఈ నెల 17వ తేదీన అదే ఇంట్లో ఐదు చీరలు, ఒక జత బంగారు కమ్మలు, అర తులం మాటీలు దొంగతనం చేసింది. అలాగే నిందితురాలైన స్వప్న ఇంటిపైన ఉన్న సంధ్యారాణి ఇంట్లో బంగారు చైన్, రూ.10 వేల నగదు చోరీ చేసింది. బాధితురాళ్ల ఫిర్యాదు మేరకు పోలీసులు ఆమెపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గంజాయి స్వాధీనం!

బుధవారపేటలో సమాచారం మేరకు మూడవ పట్టణ పోలీసులు ఓ ఇంట్లో సోదాలు చేశారు. ఆ ఇంట్లో పావుకిలో గంజాయి లభించింది. గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు ఒకరిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. ఎక్కడి నుంచి వచ్చింది, ఎవరికి విక్రయిస్తున్నారు అనే కోణంలో మరింత విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

ప్రాణం తీసిన ఈత సరదా



మృతిచెందిన షేక్ రియాన్

ఆళ్లగడ్డ: సరదాగా బావిలో ఈతకు దిగిన బాలుడు ప్రమాదవశాత్తూ నీట మునిగి మృతి చెందిన ఘటన శుక్రవారం చాగలమర్రి మండలం పెద్దవంగళి సమీపంలో చోటు చేసుకుంది. వైఎస్సార్ జిల్లా యర్రగుంట్ల పట్టణానికి చెందిన గఫార్ కుమారుడు షేక్ రియాజ్ (17) తమ బంధువుల పుట్టెంట్రుకల కార్యక్రమానికి పెద్దవంగళి దర్గా వద్దకు వచ్చాడు. అక్కడ తోటి బాలురతో కలిసి సరదాగా సమీపంలోని వ్యవసాయ బావిలో ఈతకు వెళ్లా రు. షేక్ రియాజ్ ఈత కొడుతూ ప్రమాదవశాత్తూ నీటిలో మునిగి పోయాడు. రియాజ్ ఎంతకూ బయటకు రాక పోవ డం గమనించిన సహచరులు బంధువుల కు సమాచారం ఇచ్చారు. గ్రామస్తులతో కలిసి బావిలో గాలించగా రియాజ్ మృతదేహం లభ్యమైంది. మృతుని కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమణయ్య తెలిపారు.

విద్యుత్ టారిఫ్‌పై కొనసాగిన సలహాల స్వీకరణ

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ టారిఫ్‌పై ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఈఆర్‌సీ) చేపట్టిన విచారణ శుక్రవారం కూడా కొనసాగింది. విశాఖపట్నం నుంచి చైర్మన్ జస్టిస్ నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో వీడియో కాన్ఫరెన్స్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యుత్‌పై సమగ్ర ఆదాయ, కాస్ట్, సబ్సిడీ సర్చార్జీలు, ఆవశ్యకత, టారిఫ్ ప్రతిపాదనలపై సలహాలు, సూచనలు, అభ్యంతరాలు, విన్నపాలు స్వీకరించారు. దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోషరావు, కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం. ఉమాపతి పాల్గొన్నారు. శనివారం కూడా సలహాలు, అభ్యంతరాలు, సూచనలు సేకరణ ఉంటుందని, ఏపీ ఈఆర్‌సీ వెబ్‌సైట్ / మెయిల్‌లో ముందుగా రిజిష్టర్ చేసుకున్న వారు ఆన్‌లైన్ ద్వారా పాల్గొనేందుకు కర్నూలు విద్యుత్ భవన్, నంద్యాల, ఆదోని, డోన్ డివిజన్ కేంద్రాల్లో వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

గాలి పటం ఎగుర వేస్తుండగా..

- విద్యుదాఘాతంతో బాలుడికి గాయాలు



గాయపడిన శివశంకర్ ఆచారి

డోన్ రూరల్: పట్టణంలో ఓ బాలుడు సరదాగా గాలిపటం ఎగుర వేస్తుండగా విద్యుదాఘాతానికి గురై తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక తారకరామనగర్ కాలనీకి చెందిన బ్రహ్మేశ్వరి కుమారుడు శివశంకర్ ఆచారి 8వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికొచ్చిన వెంటనే గాలి పటం ఎగుర వేసేందుకు ఇంటిపైకెక్కాడు. అయితే గాలి పటం పక్కనే ఉన్న విద్యుత్ తీగల మీద పడి చిక్కుకుపోయింది. అక్కడే ఉన్న ఇనుప కడ్డీతో తీసే ప్రయత్నం చేయగా శివశంకర్ ఆచారి విద్యుదాఘాతానికి గురై తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు. శివశంకర్ తండ్రి సురేష్ ఆచారి అనారోగ్యంతో కొన్నేళ్ల క్రితం మరణించగా, తల్లి బ్రహ్మేశ్వరి కూలీ పనికెళ్తూ కుటుంబాన్ని పోషిస్తోంది.

స్త్రీనిధి బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ ఎన్నికలకు నేడు నామినేషన్లు

కర్నూలు(అగ్రికల్చర్): స్త్రీనిధి బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ ఎన్నికలకు శనివారం నామినేషన్లు స్వీకరించనున్నారు. ఈ నెల 27న పోలింగ్ నిర్వహిస్తారు. ప్రతి జిల్లా నుంచి ఒక బోర్డ్ ఆఫ్ డైరెక్టర్‌ను ఎన్నుకుంటారు. కర్నూలు జిల్లాలో నాలుగు, నంద్యాల జిల్లాలో మూడు మండలాల మహిళా సమాఖ్య అధ్యక్షులు స్త్రీ నిధి బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ ఎన్నికల్లో పాల్గొనేందుకు అర్హత లభించింది. కర్నూలు జిల్లాలో హాలహర్వి, హొళగుంద, చిప్పగిరి, ఆలూరు, నంద్యాల జిల్లాలో పగిడ్యాల, వెలుగోడు, మిడుతూరు మండలాల మహి ళాసమాఖ్య అధ్యక్షులు స్త్రీనిధి ఎన్నికల్లో పాల్గొననున్నారు. శనివారం విజయవాడలో జరిగే స్త్రీనిధి బోర్డ్ డైరెక్టర్‌ల ఎన్నికల నామినేషన్ల కార్యక్రమంలో వీరు పాల్గొంటున్నారని డీఆర్‌డీఏ-వైకేపీ అధికారులు తెలిపారు. ఐదేళ్లకోసారి స్త్రీనిధి బోర్డు ఎన్నికలు జరుగుతాయి. 2018లో ఎన్నికలు జరుగగా.. మళ్లీ ఇప్పుడు జరుగుతున్నాయి.

పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత



సిబ్బంది సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

- ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ వెల్లడి

కర్నూలు (టౌన్): జిల్లాలో పోలీసు సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో పోలీసు గ్రీవెన్స్ డే నిర్వహించారు. జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్లు ఆయా విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న 27 మంది సిబ్బంది ఆరోగ్య సమస్యలు, రిక్వెస్ట్ బదిలీలను ఎస్పీకి విన్నవించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గ్రీవెన్స్‌కు వచ్చిన పోలీసుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీపీఓ ఏఓ సురేష్ బాబు, స్పెషల్ బ్రాంచ్ సీఐ ప్రసాద్ పాల్గొన్నారు.

జూడో పోటీలకు సహకారం అందిస్తాం



ఖేలో ఇండియా జూడో పోటీల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పి.కోటేశ్వరరావు

కర్నూలు (టౌన్): ఈ నెల 29 నుంచి వచ్చే నెల 2 వ తేదీ వరకు కర్నూలు నగరంలో నిర్వహిస్తున్న దక్షిణ భారత స్థాయి ఖేలో ఇండియా జూడో పోటీలకు సహకారం అందిస్తానని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ జూడో సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలకు, క్రీడల నిర్వహణకు సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. జూడో సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీధర్ మాట్లాడుతూ 6 రాష్ట్రాల నుంచి నాలుగు కేటగిరీలలో 1800 మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర సెపక్‌తక్రా సంఘం కార్యదర్శి శ్రీనివాసులు, జూడో సంఘం జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, కోశాధికారి రమేష్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించండి

- ఆర్‌యూ వీసీ ఆనందరావు, డీటీసీ శ్రీధర్



ర్యాలీలో పాల్గొన్న ఆర్‌యూ వీసీ ఆనందరావు, డీటీసీ శ్రీధర్

కర్నూలు(సెంట్రల్): రోడ్డు భద్రతా నిబంధనలపై పిల్లలకు చిన్నప్పటి నుంచే తల్లిదండ్రులు అవగాహన కల్పించాలని రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆనందరావు, డీటీసీ శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మూడో రోజు కలెక్టరేట్ నుంచి సీక్యాంపు వరకు రోడ్డు భద్రతా నియమాలపై ప్రజలకు అవగాహన కోసం స్వచ్ఛత పక్వాడా-2023లో భాగంగా వాక్తాన్ నిర్వహించారు. ఈ ర్యాలీని ఆర్‌యూ వీసీ, డీటీసీ సంయుక్తంగా కలెక్టరేట్ దగ్గర ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువత అతివేగంతో వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. ప్రమాదాల్లో అత్యధికంగా యువత మృతి చెందుతుండటం బాధాకరమన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకుంటే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో రీజినల్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్ రమేష్, ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం, విద్యార్థులు పాల్గొన్నారు.

దంపతుల ఉసురు తీసిన అప్పులు

- హైదరాబాద్‌లో భార్యాభర్తల ఆత్మహత్య
- మారందొడ్డిలో విషాదఛాయలు



వడ్ల పద్మాచారి, మౌనిక (ఫైల్)

సి.బెళగల్: కుటుంబ అవసరాల నిమిత్తం చేసిన అప్పులు దంపతుల ఉసురు తీశాయి. సి.బెళగల్ మండలం మారందొడ్డి గ్రామానికి చెందిన భార్యాభర్తలు వడ్ల పద్మాచారి (28), మౌనిక (21) ఉరివేసుకుని హైదరాబాద్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వీరన్న, సరోజమ్మ దంపతుల ఏకైక కుమారుడు వడ్ల పద్మాచారికి బ్రాహ్మణదొడ్డి గ్రామానికి చెందిన మౌనికతో మూడేళ్ల క్రితం వివాహం అయ్యింది. పెళ్లయిన నాటి నుంచి పద్మాచారి, మౌనిక దంపతులు హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి ప్రాంతం జగద్గిరిగుట్ట కాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. కార్పెంట్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే గురువారం ఉదయం పద్మాచారి అక్క కుమారుడు పవన్ ఇంటికెళ్లి తలుపు తట్టగా లోపల గడివేసుకుని ఎంతకీ స్పందన రాలేదు. పొరుగువారి సహాయంతో కిటికీ అద్దాలను పగులగొట్టి లోపలకి చూడగా ఉరికి వేలాడుతూ మౌనిక, విగతజీవిగా పద్మాచారి కనిపించారు. తలుపులను బద్దలకొట్టి లోపలకు వెళ్లి , స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను శనివారం మారందొడ్డి గ్రామానికి తీసుకొస్తారని మృతుల బంధువులు తెలిపారు. పద్మాచారి గ్రామంలోను, హైదబాద్‌లోను పలు ఫైనాన్స్ సంస్థలలో అప్పులు చేశాడని, గ్రామంలోని ఇంటిపై కూడా ఎమ్మిగనూరు పట్టణంలోని ఫైనాన్స్ సంస్థలో రూ.10 లక్షల వరకు రుణం పొందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అప్పులు తీర్చే మార్గం లేక ఆర్థిక ఇబ్బందులతో దంపతులు ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు.

కర్ణాటక మద్యం పట్టివేత



నిందితులను అరెస్ట్ చూపుతున్న సెబ్ సీఐ జయరాంనాయుడు

ఎమ్మిగనూరురూరల్: పులిచింత గ్రామం వద్ద, ఎమ్మిగనూరు పట్టణంలో కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నట్లు సెబ్ సీఐ జయరాం నాయుడు తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక సెబ్ కార్యాలయ ఆవరణలో నిందుతుల అరెస్ట్ చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెబ్ జాయింట్ డైరెక్టర్ కృష్ణకాంత్‌పటేల్ ఆదేశాల మేరకు నందవరం మండలం పులిచింత గ్రామం దగ్గర తెల్లవారుజామున వాహనాలు తనిఖీ చేస్తుండగా మోటార్ సైకిల్‌పై అక్రమంగా తరలిస్తున్న మూడు బాక్సుల కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నామని చెప్పారు. గుడేకల్ గ్రామం మల్లారిపేటకు చెందిన బోయ శ్రీనివాసులను అరెస్ట్ చేసి, బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఎమ్మిగనూరు పట్టణంలోని లక్ష్మీపేటలో తెలుగు రాముడును అరెస్ట్ చేసి అతని దగ్గర నుంచి 215 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను కోర్టులో హాజరు పరచి రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు. దాడుల్లో సెబ్ సీఐ దశరథరామిరెడ్డి, ఎస్‌ఐ సోమశేఖర్‌రావు, హెడ్‌కానిస్టేబుల్స్ రబ్బానీ, గోపాల్, లింగ ప్రసాద్, చంద్రమౌళి, ఆశ్వర్థరెడ్డి, సంజీవ్, కానిస్టేబుల్స్ రామచంద్రుడు, నరసింహారెడ్డి, రాధమ్మ, చంద్రన్న, భరత్, విరుపాక్షిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు 'దిశ' కమిటీ సమావేశం

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా అభివృద్ధి, సమన్వయం, పర్యవేక్షణ (దిశ) కమిటీ సమావేశం శనివారం జరుగుతుందని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్, దిశ కమిటీ మెంబర్, కన్వీనర్ అమరనాథ్‌రెడ్డి తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖలకు కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదలయ్యే నిధుల వినియోగంపై ఉన్నతస్థాయి సమీక్ష జరుగుతుందని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కమిటీకి కర్నూలు ఎంపీ ఎస్.సంజీవ్‌కుమార్ చైర్మన్‌గా వ్యవహరిస్తారన్నారు. జిల్లా నీటియాజమాన్య సంస్థ, డీఆర్‌డీఏ-వైకేపీ, వ్యవసాయ శాఖ, హౌసింగ్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఐసీడీఎస్, వైద్య ఆరోగ్య శాఖ, మెప్మా, అటవీ శాఖ తదితర శాఖలకు కేంద్రం నుంచి వివిధ స్కీమ్‌ల కింద నిధులు విడుదల అవుతున్నాయని ఆయన తెలిపారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో మధ్యాహ్నం 3 గంటలకు జరిగే సమావేశానికి సంబంధిత శాఖల అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

రుణాల రికవరీలకు ప్రత్యేక బృందాలు

- డీసీసీబీ చైర్‌పర్సన్ మహాలక్ష్మి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మహాలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని బ్రాంచ్‌ల్లో రుణాల రికవరీకి అధికారులతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్‌పర్సన్ మహాలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఉమ్మడి జిల్లాలోని డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్లు, అసిస్టెంటు మేనేజర్ల సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రధానంగా ఐదు బ్రాంచ్‌ల్లో నిరర్థక ఆస్తులు ఎక్కువగా ఉన్నాయని, వీటిని తగ్గించేందుకు రికవరీలపై దృష్టి సారించాలన్నారు. సీనియర్ అధికారులతో రికవరీ టీమ్స్‌ను ఏర్పాటు చేశామని, బ్రాంచ్ మేనేజర్లు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి రికవరీలను పెంచాలన్నారు. స్వయం సహాయక సంఘాలకు తక్కువ వడ్డీతో రుణాలు ఇస్తున్నామని, అయితే రుణాల పంపిణీలో పురోగతి తక్కువగా ఉందన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరం ముగిసే లోపు ప్రతి ఒక్కరు జవాబుదారితనంతో పనిచేసి నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలని పేర్కొన్నారు. సీఈవో పి.రామాంజనేయులు మాట్లాడుతూ... స్టాఫ్ అసిస్టెంటు మొదలు కొని డీజీఎంల వరకు ప్రతి ఒక్కరు అంకిత బావంతో పనిచేస్తే బ్యాంకు అభివృద్ధి పరుగులు తీస్తుందని తెలిపారు. డిపాజిట్ల సేకరణపై అన్ని బ్రాంచ్‌ల్లో ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సమావేశంలో ఆప్కాబ్ ఓఎస్‌డీ విజయకుమార్, డీసీసీబీ ఓఎస్‌డీ నాగలింగేశ్వరి, నంద్యాల జిల్లా రీజినల్ మేనేజర్ శివలీల, డీజీఎంలు ఉమామహేశ్వరరెడ్డి, సునీల్‌కుమార్, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు



నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో శుక్రవారం కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం చేసి పట్టువస్త్రాలతో అలంకరించారు. అమ్మవారికి ఒడిబియ్యం కార్యక్రమాన్ని జరిపించి మహామంగళ హారతులు ఇచ్చారు. అనంతరం రాహుకాల పూజలు చేపట్టారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణ చేయించారు. చివరగా నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

సేవా గుణాన్ని అలవర్చుకోవాలి

నంద్యాల(వ్యవసాయం): ప్రతి ఒక్కరూ సేవా గుణనాన్ని అలవర్చుకోవాలని సంఘమిత్ర సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు నాగసుబ్బారెడ్డి, చిలుకూరు శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం సంఘమిత్ర కార్యాలయంలో సంఘమిత్ర బాలుర ఆవాసం 29వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా ఈనెల 22వ తేదీన ప్రథమనందిలోని వైఎస్సార్ కల్యాణ మండపంలో సాయంత్రం 5గంటలకు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాజకీయ నాయకులు, అధికారులు పాల్గొంటారని చెప్పారు.వెంకటశ్వర్లు, విజయశ్రీ, నాగరాజయ్య, ఉదయ్‌శంకర్, రమణయ్యగౌడ్ పాల్గొన్నారు.

జాబ్‌కార్డు ఉన్న వారందరికీ పనులు కల్పించాలి



మాట్లాడుతున్న ఏపీడీ సాంబశివరావు

దొర్నిపాడు : జాబ్ కార్డు ఉన్న వారందరికీ ఉపాధి హామీ పనులు కల్పించాలని బనగానపల్లె క్లస్టర్ ఏపీడీ సాంబశివరావు సూచించారు. శుక్రవారం స్థానిక ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జాబ్ కార్డు కలిగిన కుటుంబాలు ఏడాదిలో 30 రోజులు పనులకు హాజరు కావాలని లేదంటే కార్డు రద్దు చేయస్తామని స్పష్టం చేశారు. ప్రతి ఇంటికి ఐదు మునగచెట్లను ఇస్తామని, వాటిని ఇంటి ఆవరణలో పెంచుకోవాలని చెప్పారు. ఐదేళ్లుగా జాబ్ కార్డు కల్గిన రైతుల పండ్లతోటల పెంపకానికి ఖర్చు మొత్తం ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. ఆసక్తి గల రైతులు ముందుకు రావాలని కోరారు.

పదోన్నతులు కల్పించాలి

శిరివెళ్ల: స్కూల్ అసిస్టెంట్లుగా శాశ్వత పదోన్నతులు కల్పించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నగరి శ్రీనివాసులు కోరారు. శుక్రవారం రాజనగరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఏపీ స్టేట్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్‌కు అనుగుణంగా ఎస్జీటీలకు శాశ్వత పద్ధతిలో స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించాలని, డీఏలు, పీఎఫ్, ఏపీజీఎల్ఐ, ఆర్జిత సెలవుల నగదు బకాయిలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు గురవయ్య, వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు వెంకట రమణ, ఆంజనేయులు పాల్గొన్నారు.

కృష్ణాబోర్డు ఏర్పాటు చేయాలి

నంద్యాల(వ్యవసాయం): రాయలసీమలోని కర్నూలు ఉమ్మడి జిల్లాల్లో కృష్ణా జలాల బోర్డును కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని బీజేపీ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ తూము శివారెడ్డి శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో శ్రీశైలం ప్రాజెక్టు, పోతిరెడ్డిపాడు, హంద్రీనీవా, మల్యాల ముచ్చుమర్రి, సృజల స్రవంతి తదితర ప్రాజెక్టులు కృష్ణా జలాల పరివాహం కింద ఉన్నందున ఉమ్మడి జిల్లాలో ఏర్పాటు చేయాలని కోరారు. నాయకులు మహేశ్వరరెడ్డి, రామమనోహర్‌నాయుడు, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

నంద్యాల(అర్బన్): విజయడెయిరీలో తొలగించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తోట మద్దులు, కార్యదర్శి బాలవెంకట్ కోరారు. కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ స్థానిక పద్మావతినగర్ ఆర్చి వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో తొలగించిన కార్మికులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. తోట మద్దులు మాట్లాడుతూ 20ఏళ్లుగా డెయిరీలో కార్మికులుగా పనిచేస్తున్న వారిని అకారణంగా తొలగించడం అన్యాయమన్నారు. యాజమాన్యం తక్షణమే చర్యలు తీసుకొని వారిని విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు లక్ష్మణ్, గౌస్, కార్మికులు ప్రసాద్, సుబ్బయ్య, ప్రభాకర్, దస్తగిరి పాల్గొన్నారు.

పుస్తకాల అందజేత

ఉయ్యాలవాడ : మండలంలోని ఆర్.పాంపల్లె గ్రామంలో విద్యార్థులకు విశ్రాంత లైబ్రేరియన్ నరసింహారెడ్డి సామాజిక అంశాలకు సంబంధించిన పుస్తకాలను శుక్రవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి పాఠ్యపుస్తకాలతో పాటు సామాజిక అంశాలు, చరిత్ర పుస్తకాలను చదవడంతో భవిష్యత్‌కు ఎంతో దోహదపడతాయన్నారు. మహనీయుల చరిత్ర పఠనం ద్వారానే తెలుస్తుందని చెప్పారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ

శిథిల భవనాలు, అద్దె గదుల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ పట్టనుంది. మండలంలో ఆరు కేంద్రాలకు నూతన భవనాలు నిర్మించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందుకు సంబంధించి నిధులు కూడా విడుదలవటంతో పనులు ప్రారంభమయ్యాయి. నిర్మాణాలు పూర్తయిన తరువాత పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించి వినియోగంలోకి తెస్తామని అధికారులు పేర్కొంటున్నారు.



గోస్పాడులో అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణాన్ని ప్రారంభించిన దృశ్యం

- మండలంలో ఆరు నూతన భవనాల నిర్మాణానికి నిధుల విడుదల
- ఒక్కో భవనానికి రూ.16 లక్షల కేటాయింపు
- ప్రారంభమైన పనులు



యాళ్లూరులో అద్దె భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

గోస్పాడు: అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేక ఎంతో కాలంగా సిబ్బంది, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం కేంద్రాల్లో పూర్తిస్థాయిలో తీర్చిదిద్దాలనే లక్ష్యంతో నూతన భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసింది. మండలంలో మొత్తం 42 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 22 కేంద్రాలకు సొంత భవనాలుండగా, ఆరు కేంద్రాలు ప్రభుత్వ పాఠశాలల్లో, మరో 14 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. పలు గ్రామాల్లో అద్దె భవనాలు లేకపోగా, అరకొరగా వసతులు ఉన్న వాటిలోనే నిర్వహించాల్సి వస్తోంది. వీటిని పరిష్కరించాలని ఆరింటికి భవనాలు నిర్మించాలని నిధులు విడుదల కావడంతో పనులు మొదలయ్యాయి.

కేంద్రాల పరిధిలో..

మండలంలోని 42 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 279 మంది గర్భిణులు, 314 మంది బాలింతలు, 968 మంది మూడేళ్ల లోపు చిన్నారులు, 916 మంది 3 – 6 సంవత్సరాల్లోపు చిన్నారులు ఉన్నారు. వీరికి ఆయా కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందించే పౌష్టికాహారం అందజేస్తున్నారు. అలాగే చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నారు.

నిర్మాణాలు ప్రారంభం..

భవనాలకు నిధులు మంజూరు కావడంతో పనులు ప్రారంభమయ్యాయి. మండలంలో ఆరు భవనాలు మంజూరు కాగా వాటిలో ఒక్కో భవన నిర్మాణానికి రూ.16లక్షలు విడుదలయ్యాయి. ఇందులో రూ.2.50లక్షలు చిన్నారుల ఆట వస్తువులకు, రూ.13.5 లక్షలు భవన నిర్మాణానికి కేటాయించినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. గోస్పాడు 1, 2 వ కేంద్రాలతో పాటు బి.కొట్టాల, ఎస్.కూలూరు, ఎం.కృష్ణాపురం-2, దీబగుంట్ల-3 వ కేంద్రాలకు నూతన భవనాలు నిర్మిస్తున్నారు. గోస్పాడులో మూడు కేంద్రాలకు ఒకే చోట భవన నిర్మాణ పనులు చేపట్టారు.

పనులు ప్రారంభమయ్యాయి

గతంలో అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేక అవస్థలు పడాల్సి వచ్చింది. ప్రభుత్వం ఆరు కేంద్రాలకు నూతన భవనాల నిర్మాణాలు చేపట్టేందుకు నిధులు మంజూరు చేసింది. దీంతో పనులు ప్రారంభమయ్యాయి. పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాం. నిర్మాణాలు పూర్తయితే చిన్నారులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది.

–శోభారాణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, గోస్పాడు

సాగు నీటిని వృథా చేయొద్దు

- ఎస్ఈ వెంకటరమణయ్య

రుద్రవరం: రైతులు తెలుగుగంగ కాల్వ నీటిని వృథా చేయకుండా తగినంత వరకే వినియోగించుకోవాలని ఆ శాఖ ఎస్ఈ వెంకట రమణయ్య సూచించారు. శుక్రవారం ఆయన రుద్రవరం,ఆళ్లగడ్డ మండలాల పరిధిలో తెలుగుగంగ ప్రధాన కాల్వ వెంట పర్యటించి నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల నియోజకవర్గంలోని పలు మండలాల పరిధిలోని ఆయకట్టు రైతులకు సాగు నీరు అందక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే నీరందించాలని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి కోరడంతో వెంటనే వెలుగోడు రిజర్వాయరు నుంచి దాదాపు 2వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని చెప్పారు. ఆ నీరు ప్రస్తుతం రుద్రవరం సమీపంలోని గండ్లేరు జలాశయం నుంచి అహోబిలం మీదుగా దిగువకు సాగు ప్రవహిస్తుందన్నారు.అయితే అవసరంలేని చోట రైతులు నీటిని వృథా చేయకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఈ నెల 27న కాల్వలో నీటి విడుదల నిలిపివేసి వారబందీ పద్ధతిన తిరిగి ఫిబ్రవరి 4న నీటిని విడుదల చేస్తామని తెలిపారు. ఆయన వెంట నంద్యాల,ఆళ్లగడ్డ డివిజన్ అధికారులు ఉన్నారు.

ఉద్యోగుల ప్రయోజనాలే ముఖ్యం

బొమ్మలసత్రం: రాష్ట్రంలో పనిచేస్తున్న ఉద్యోగుల సంక్షేమం కోసమే ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ గవర్నర్‌ను కలిశారని, ఆయన సొంత ప్రయోజనాల కోసమని చెప్పడం సరికాదని ఏపీజీఈఏ జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ గిరిశివశంకర్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీఎన్‌జీవోస్ సంఘం నాయకులు వారి స్వప్రయోజనాల కోసమే పనిచేస్తూ, ఉద్యోగుల హక్కుల కోసం పోరాడుతున్న ఏపీజీఈఏ సంఘాన్ని తప్పుబట్టడం హాస్యాస్పదమన్నారు. ఉద్యోగుల సంఘం కోసం నిర్మించుకున్న కార్యాలయాన్ని కల్యాణ మండపాలుగా, కమర్షియల్ కాంప్లెక్స్‌లుగా మార్చి సొమ్ము చేసుకోవటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.జిల్లా కార్యదర్శి నాగేంద్రప్ప, కోశాధికారి శ్రీనివాసరావు, తాలూకా అధ్యక్షుడు వెంకటరమేష్, కార్యదర్శి గౌస్ పాల్గొన్నారు.

నీటి విడుదలను కొనసాగించాలి

రుద్రవరం: తెలుగుగంగ ప్రధాన కాల్వలో వారబందీ పద్ధతిలో భాగంగా నీటి పారుదలను నిలిపేయకుండా అలాగే కొనసాగించాలని 19వ బ్లాక్ ఉప ప్రధాన కాల్వ పరిధిలోని చందలూరు, చిలుకలూరు, మందలూరు గ్రామాల ఆయకట్టు రైతులు తెలుగుగంగ అధికారులను కోరారు. శుక్రవారం ఎస్ఈ వెంకటరమణయ్య కాల్వ ఉంట వెళ్లిన కొద్దిసేపటికి 20 బ్లాక్ వద్ద ఉన్న డీఈఈ చంద్రఓబుళ రెడ్డి, ఏఈఈలతో రైతులు సమస్యను ఏకరువు పెట్టారు. 19వ బ్లాక్ కాల్వ పరిధిలో జొన్న, మినుము,వరి వంటి పంటలు సాగు చేశామని, ప్రస్తుతం పంటలు కీలక దశలో ఉన్నాయని, ఇలాంటి సమయంలో నీటి విడుదలను నిలిపేస్తే పంటలు దెబ్బతింటాయని వాపోయారు. ఈ విడత వార బందీ పద్ధతిని వాయిదా వేసి కాల్వలో నీటి పారుదలను కొనసాగించి ఆదుకోవాలని కోరారు. అధికారులు మాట్లాడుతూ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

గిరిపుత్రులకు బాలాధార్



దరఖాస్తును పరిశీలిస్తున్న అధికారులు

రుద్రవరం: మండలంలోని కోటకొండ పంచాయతీ మజరా అయిన చిన్నయ్య స్వామి చెంచు గూడేం చిన్నారుల బాలాధార్‌కు శుక్రవారం గ్రామ సచివాలయంలో దరఖాస్తు ప్రక్రియ చేపట్టారు. గూడెంలో ఐదేళ్లలోపున్న 34 మంది చిన్నారులకు ఆధార్ కార్డులు లేక ఇబ్బందులు పడేవారు. సమస్యను ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో అధికారులు స్పందించి ఆధార్ కార్డులు లేని వారితో దరఖాస్తు చేయించాలని ఆదేశించారు. దీంతో కోటకొండ సచివాలయంలో సర్పంచు డేగాని వెంకటేష్ ఆధ్వర్యంలో దరఖాస్తు ప్రక్రియ ప్రారంభించారు. కాగా శుక్రవారం 15 మంది చిన్నారులకు దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేసినట్లు పంచాయతీ కార్యదర్శి షాహినూర్ తెలిపారు. ప్రక్రియను ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి పరిశీలించారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



మిరప పంటను పరిశీలించి రైతులకు సూచనలిస్తున్న ధరణి

ఉయ్యాలవాడ : మిరప పంట సాగు చేసిన రైతులు పంటను కాపాడుకునేందుకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కోవెలకుంట్ల ఉద్యానవన శాఖ అధికారిణి ధరణి సూచించారు. శుక్రవారం మండలంలోని ఇంజేడు, ఉయ్యాలవాడ గ్రామాల్లో మిరప పంటను పరిశీలించారు. అనంతరం స్థానిక రైతు భరోసా కేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించి పంట సాగులో చేపట్ట వలసిన సస్యరక్షణ పనులు, తెగుళ్ల నివారణకు తీసుకోవలసిన పద్ధతులపై సలహాలు, సూచనలు చేశారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలించడంతో పంటకు చీడపీడల బెడద తగ్గిందన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు సరళ పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి



ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ జ్యోతి

రుద్రవరం: ఎరువులు,పురుగు మందుల దుకాణాల్లో రికార్డుల నిర్వాహణ సక్రమంగా ఉండేలా చూసుకోవాలని మండల వ్యవసాయాధికారి జ్యోతి దుకాణాదారులకు సూచించారు. మండలంలోని ఎల్లావత్తులలో శక్రవారం ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువులు,పురుగు మందులను పరిశీలించారు. అలాగే స్టాకుకు, రికార్డుల్లో ఉన్న సంఖ్యను సరిపోల్చుకున్నారు.ఆమె మాట్లాడుతూ రికార్డుల్లో స్టాకు తేడాలు లేకుండా చూసుకోవాలని, కొనుగోలు చేసిన వాటికి సంబంధించి రైతులకు బిల్లులు కచ్చితంగా ఇవ్వాలని, నకిలీలు విక్రయించరాదని ఆదేశించారు. నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.అనంతరం కోటకొండలో సాగుతున్న ఈ-క్రాప్ బుకింగ్‌ను పర్యవేక్షించారు.

సుందరీకరణ పనులు త్వరలో పూర్తి



పనులను పరిశీలిస్తున్న ఈఓ, చైర్మన్‌లు

మహానంది: క్షేత్రంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సొంత నిధులతో చేపడుతున్న సుందరీకరణ పనులు త్వరలోనే పూర్తి చేస్తామని ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా పాల మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జునలతో కలిసి శుక్రవారం సాయంత్రం ఆయన పనులు పరిశీలించారు. పలు పనులు వేగంగా సాగుతున్నాయని చెప్పారు. వారి వెంట ఆలయ ఇన్‌స్పెక్టర్ హరినాథ్ ఉన్నారు.

కంటైనర్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

ఉయ్యాలవాడ : మండలంలోని అల్లూరు గ్రామ సమీపంలో పాలేరు వంతెనపై కంటైనర్ బైక్‌ను ఢీకొన్న సంఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. శుక్రవారం హెడ్ కానిస్టేబుల్ కొండయ్య తెలిపిన వివరాల మేరకు.. సంజామల మండలం ఆర్.లింగందిన్నె గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు కోవెలకుంట్ల పట్టణం నుంచి ద్విచక్ర వాహనంపై గ్రామానికి తిరిగి వస్తుండగా జమ్మలమడుగు వైపు నుంచి వస్తున్న సిమెంట్ కంటైనర్ ఢీ కొనడంతో వెంకటేశ్వర్లు తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం నంద్యాల ఆసుపత్రికి తరలించారు. బాధితుడి భార్య వెంకటలక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.


యువకుడి ఆత్మహత్య

ఆళ్లగడ్డ: పట్టణంలోని బుడగ జంగాల వీధికి చెందిన పాములేటి (24) అనే యువకుడు ఎగువ-దిగువ అహోబిలం మధ్యలోనున్న ఓ మండపం వద్ద ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రూరల్ ఎస్ఐ నరసింహులు తెలిపిన వివరాల మేరకు..పాములేటి మద్యానికి బానిస కావడంతో పాటు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ ఉండేవాడన్నారు. దీంతో వారం క్రితం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చన్నారు. దుర్వాసన వస్తుండంతో దారిన వెళ్లే వారి సమాచారంతో ఘటనా స్థలానికి వెళ్లి చూడగా ఉరికి వేలాడుతూ కనిపించినట్లు చెప్పారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

నంద్యాల(అర్బన్): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు పిలుపునిచ్చారు. నంద్యాల పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి వచ్చిన నాయకులు, పార్టీ కార్యకర్తలతో శుక్రవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణంలోని ఓ హోటల్‌లో డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్ అధ్యక్షతన పార్టీ నంద్యాల పార్లమెంట్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. తెలంగాణ మాజీ పీసీసీ అధ్యక్షుడు, నల్గొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

సమగ్రంగా సర్వే



పరిశీలిస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ కిరణ్‌కుమార్

బండిఆత్మకూరు: నంద్యాల-కల్వకుర్తి జాతీయ రహదారి 167కే సర్వే పనులు సమగ్రంగా చేపట్టినట్లు సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం బండిఆత్మకూరు, పార్నపల్లె గ్రామాల మధ్య చేపట్టనున్న జాతీయ రహదారిని పరిశీలించారు. 476, 478 సర్వే నంబర్లలో కొలతలు వేసి తనిఖీ చేశారు. ఆయన వెంట సర్వేయర్ శివప్రసాద్, వీఆర్ఓ ఏసుపాదం ఉన్నారు.

ఏ సమస్య వచ్చినా మేమున్నాం

ఉయ్యాలవాడ: ప్రజలకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటామని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. శుక్రవారం ఆమె మండలంలోని రూపనగుడి గ్రామంలో పర్యటించారు. కార్యక్రమంలో మండల నాయకులు కూడాల నారాయణరెడ్డి, బోరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, మూరంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మహానందీశ్వర దంపతులకు పల్లకీసేవ



పల్లకీసేవలో పాల్గొన్న ఈఓ, భక్తులు

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ గంగా, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామివార్లు శుక్రవారం రాత్రి పల్లకీలో విహరించారు. ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు, పండితులు స్వామివార్ల ఉత్సవమూర్తులను అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాకారాల్లో ఉత్సవం వైభవంగా చేపట్టారు. పూజా కార్యక్రమాల్లో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరినాథ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

నంద్యాల(రూరల్): పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో నిర్వహణ పనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పట్టణ డి1,డి2, డి3 విద్యుత్ సెక్షన్ల ఏఈలు నాగరాజు, రామయ్య, రవికుమార్ శుక్రవారం తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పట్టణంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నమని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉయ్యాలవాడ : స్థానిక 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ గురప్ప తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహరించాలని కోరారు.

ఆసుపత్రిని సీజ్ చేయాలి

నంద్యాల(అర్బన్): పేదల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న నంద్యాల క్రిటికల్ కేర్ ఆసుపత్రిని సీజ్ చేయాలని ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ధనార్జనే ధ్యేయంగా నడుస్తున్న ఆసుపత్రిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, ఆర్ఎస్‌ఏ, ఆర్‌వీఎఫ్, ఏపీఎస్ జేఏసీ నాయకులు ధనుంజయుడు, రాజునాయుడు, వేణుమాధవరెడ్డి, పూలవెంకట్, ఎర్రిస్వామి, సురేష్, మనోహర్ ఆధ్వర్యంలో శుక్రవారం పద్మావతినగర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ధనుంజయుడు మాట్లాడుతూ వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చే రోగులను దోచుకుంటున్నారని ఆరోపించారు.

మల్లన్నకు నృత్యనివేదన



నృత్యప్రదర్శన చేస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం రెండవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణమాడవీధిలోని నిత్యకళావేదికపై నిర్వహించిన సంప్రదాయ నృత్యప్రదర్శన భక్తులను అలరించింది. వినాయకకౌత్వం, ఓం నమఃశివాయ, హిమగిరితనయ శివతాండవం, శివాష్టకం తదితర గీతాలకు కె.నిహారికసాయి, కె.శ్రేయ, కె.తరుణి, సి.స్వాతి, జె.అంజలి, రక్షిత, అనిత, లాస్యప్రియ, వర్షిక తదితరులు నృత్యప్రదర్శన చేశారు.

ఆకట్టుకున్న భజన

ఆలయ దక్షిణమాఢవీధిలో నిత్యకళారాధన వేదికపై గాజులపల్లికి చెందిన ఎస్.రామతులసీ, బృందం వారిచే శుక్రవారం నిర్వహించిన భజన కార్యక్రమం ఆకట్టుకుంది. స్వామి, అమ్మవార్లను స్తుతిస్తూ భక్తి గీతాలు, అష్టకాలను ఎ.కొండారెడ్డి, బి.రామనాయుడు, వి.నాగేశ్వరరావు, డి.సురేష్, కె.ధనుంజయ, ఎ.జయరాముడు, వి.బాలరంగప్ప, తిప్పయ్య, జి.చంద్రప్ప, ఎస్.పెద్దపుల్లమ్మ, ఎస్.రంగయ్య, పి.నరశింహుడు తదితరులు ఆలపించారు.

గిరిజనుల అభివృద్ధే ధ్యేయం



గిరిజనుల సమస్యలు వింటున్న డిప్యూటీ సీఎం రాజన్న దొర

మహానంది: గిరిజనుల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని అటవీశాఖ అధికారులు గిరిజనులను ఉద్దేశపూర్వకంగా ఇబ్బందులు పెట్టొద్దని డిప్యూటీ సీఎం రాజన్నదొర సూచించారు. మహానందీశ్వరుడి దర్శనార్థం శుక్రవారం సాయంత్రం నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డితో కలిసి వచ్చారు. ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా పాల మహేశ్వర్‌రెడ్డి, ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జునలు వారికి స్వాగతం పలికారు. కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామివార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. అనంతరం డిప్యూటీ సీఎం రాజన్నదొర విలేకరులతో మాట్లాడుతూ అడవిలో పుట్టి, పెరిగి, అడవిలోనే ప్రాణాలొదిలే పేద గిరిజనులను అటవీశాఖ అధికారులు చట్టాల పేరుతో ఇబ్బందులు పెట్టడం పద్ధతికాదన్నారు. రాష్ట్రంలో పలు చోట్ల గిరిజనులు ఇళ్లు కావాలని అడుగుతున్నారని, సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తానన్నారు. టీడీపీ హయాంలో గిరిజనులకు ఇచ్చిన సబ్సిడీ పథకాలన్ని సొంతపార్టీ వారికే దక్కాయని, పేద గిరిజనులకు అందింది శూన్యమన్నారు. కానీ నేడు ఎక్కడా పైసా అవినీతి లేకుండా పాలన సాగిస్తుంటే రోడ్లపేరుతో దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ నెల 29న మూడో విడత ఆసరా పథకం విడుదల చేయనున్నట్లు చెప్పారు. పట్టాలిచ్చి, బోర్లు వేసుకోనివ్వడం లేదంటూ మహానంది గిరిజనులు డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకురాగా సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఇళ్లకు సంబంధించి పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలని తహసీల్దార్ జనార్దన్‌శెట్టిని ఆదేశించారు.

నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదు

మహానందిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను డిప్యూటీ సీఎం రాజన్నదొర, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డిలు తనిఖీ చేశారు. విద్యార్థులతో పలు అంశాలపై ముచ్చటించారు. రాజన్నదొర మాట్లాడుతూ విద్యార్థులకు ఏ చిన్న అనారోగ్యం వచ్చినా వెంటనే వైద్యసేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. నాసిరకంగా నిర్మించిన డార్మెటరీ నిర్మాణంపై విచారణ జరపాలని గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీని ఫోన్లో ఆదేశించారు. ఏపీ ఎస్టీ కమిషన్ మెంబర్ వడిత్యా శంకర్‌నాయక్, గిరిజన ప్రజాసమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్, బంజార ధర్మసేన రాష్ట్ర అధ్యక్షుడు రత్నవత్ రాజారామ్‌నాయక్, ట్రైబల్ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రప్ప, రవినాయక్, బాలునాయక్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటా..సంక్షేమ ఫలాల పంట



మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

- ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి
- పట్టణంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

ఆళ్లగడ్డ: వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్లలోనే ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందేలా చేశారని, ఇప్పటికే ఇచ్చిన హామీల్లో 95 శాతానికి పైగా నేరవేర్చారని ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 5వ వార్డు సచివాలయ పరిధిలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి సంక్షే పథకాలు అందుతున్నాయా లేదా అని, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పథకాల తీరు గురించి స్థానికులను ప్రశ్నించగా సంతృప్తి వ్యక్తం చేశారు. అభివృద్ధి, సంక్షేమం తమప్రభుత్వానికి రెండు కళ్లలాంటివన్నారు. సామాజిక పింఛన్ల పంపిణీలో వలంటీర్ల పనితీరు ప్రజలందరూ కొనియాడుతున్నారన్నారు. గత ప్రభుత్వం జన్మభూమి కమిటీల పేరిట తమకు అనుకూలమైన వారికే పథకాలు అందజేసిందని విమర్శించారు. మూడేళ్లలో కోట్లాది రూపాలను దళారుల ప్రమేయం లేకుండా పారదర్శంగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమచేయడం దేశానికే ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. విజయ డెయిరీ చైర్మన్ ఎస్వీ. జగన్ మోహన్‌రెడ్డి, ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మాదం మరియమ్మ, కౌన్సిలర్లు సుధాకర్‌రెడ్డి, సంజీవ, న్యాయవాది అశ్వత్థరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు రమేష్ గౌడ్, నాయకులు నరసింహారెడ్డి, సింగం వెంకటేశ్వరరెడ్డి, నజీర్, చెన్నయ్య, కిశోర్, నల్లవాగుపల్లె రఘు పాల్గొన్నారు.